Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 190 | Sunday : 06.07.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :190 | ఆదివారం 6 జూలై 2025 | వెల : 3 | పేజీలు : 4


WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్ : 9440815774



## హైడెన్సిటీ రెసిడెన్షియల్

# జోన్‌కు ఆమోదం

- రాజధానిలో 20,494 ఎకరాల భూ సమీకరణకు గ్రీన్ సిగ్నల్
- అమరావతిలో అల్లూరి, అమరజీవి స్మారక చిహ్నాలు
- ఎంఎస్‌కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడెమీకి 12 ఎకరాలు కేటాయింపు
- పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడెమీకి మరో 12 ఎకరాలు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ అథారిటీలో నిర్ణయాలు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశమైన 50వ సీఆర్డీఏ అథారిటీ రాజధాని నిర్మాణానికి అవసరమైన కీలకమైన నిర్ణయాలను తీసుకుంది. మొత్తం ఏడు అంశాలకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదాన్ని తెలియచేసింది. ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో జరిగిన సీఆర్డీఏ అథారిటీ సమావేశానికి పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీఆర్డీఏ, ఏడీసీ, ఆర్థిక శాఖ, సీసీఎల్ఏకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాజధాని పరిధిలో మరో 20,494 ఎకరాల మేర భూ సమీకరణకు అథారిటీ ఆమోదం తెలిపింది. పలనాడు జిల్లా అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెదమద్దూరు, యండ్రాయి, కార్లపూడిలేమల్లే, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాల్లో ఈ భూ సమీకరణ చేసేందుకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదాన్ని ఇచ్చింది. రాజధానిలో హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్ సహా మిశ్రమ అభివద్ధి ప్రాజెక్టులకు ఆర్ఎఫ్‌పీ పిలిచేందుకు ఆమోదాన్ని తెలిపింది. మందడం, రాయపూడి, పిచుకలపాలెంలలో ఫైనాన్స్, స్పోర్ట్స్ సిటీల్లోని దాదాపు 58 ఎకరాల్లో ఈ హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్, మిశ్రమ అభివద్ధి ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్ఎఫ్‌పిని ఆహ్వానించేందుకు సీఆర్డీఏకు అనుమతి ఇచ్చింది. అలాగే అమరావతిలో నిర్మించే ఫైవ్ స్టార్ హోటళ్లకు సమీపంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం కోసం సీఆర్డీఏ చేసిన ప్రతిపాదనలకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదాన్ని - మిగతా3లో



## చెక్కతో చేసిన సాధారణ కుర్చీలా చూడొద్దు

- మోదీ ఎమోషనల్ స్పీచ్.. ఈ కుర్చీ ప్రత్యేకత ఇదే!
- ఇది భారత్–ట్రినిడాడ్ అండ్ టొబాగో మధ్య ఉన్న స్నేహం, నమ్మకం, దృఢమైన ప్రజాస్వామ్య బంధానికి నిదర్శనం
- ఏళ్ల పాటు బ్రిటీష్ పాలనలో ఉన్న ట్రినిడాడ్ అండ్ టొబాగోకు 1962లో విముక్తి
- దీంతో ఈ దేశానికి 1968లో ఓ ప్రత్యేక బహుమతిని పంపించింది భారత ప్రభుత్వం.



## 20ఏళ్ల తర్వాత.. ఒకే వేదికపై ఠాక్రే సోదరులు

- 2005లో విడిపోయిన వీరు దాదాపు 20 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకోవడం మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం
- ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవడం ద్వారా మన పిల్లలు సరైన విషయాలు నేర్చుకొనే అవకాశం లేకుండా పోతోంది
- ఇంగ్లీష్ మీడియంలో చదువుకున్నప్పటికీ తమ మాతృభాషలైన తెలుగు, తమిళం వంటి భాషల విషయంలో ఎంతో గర్వంగా ఉంటారు.

## మరో 30-40 ఏళ్లు జీవించాలని ఆశగా ఉంది

- టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా
- మరికొన్నేళ్లు ఆరోగ్యంగా జీవించగలననే దేవుని స్పష్టమైన సంకేతాలు తనకు అందుతున్నాయి
- బుద్ధుని బోధనల వ్యాప్తికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా
- ప్రస్తుతం తనకు 90 ఏళ్లు నిండటంతో 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది

# బడిబాట పట్టేందుకు సాయం

- చిన్నారుల ఆవేదన విని చలించిపోయిన మంత్రి లోకేష్
- పేదరికం నుంచి బయటకు తెచ్చే ఒకే ఒక్క సాధనం విద్య
- జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్న కసి, పట్టుదల ఉంటే ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్యాన్ని చేరుకోవచ్చు
- నెల్లూరులోని ఈ చిన్నారులు తమ కలలను సాకారం చేసుకునేందుకు అన్నివిధాల అండగా నిలుస్తాం'



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

చదువంటేనే అమ్మో అని భయపడిపోతుంటారు విద్యార్థులు. అలాంటిది మాకు చదువు చెప్పించండి సారూ! అంటూ నెల్లూరులో భిక్షాటన చేసే ఇద్దరు బాలురు అధికారులను బతిమాలిన సంఘటన ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకష్ దృష్టికి వెళ్లింది. దీనిపై ఆయన వెంటనే ఎక్స్ వేదికగా ఇలా స్పందించారు. 'నెల్లూరు విఆర్ స్కూలు వద్ద పెంచలయ్య, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు చిన్నారులు తమకు చదువు చెప్పించాలని కమిషనర్‌ను ప్రాధేయపడటం నన్ను కదిలించింది. ఆ చిన్నారుల విద్యాభ్యాసానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా అక్కడి అధికారులను ఆదేశించాను. పేదరికం నుంచి బయటకు తెచ్చే ఒకే ఒక్క సాధనం విద్య. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్న కసి, పట్టుదల ఉంటే ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్యాన్ని చేరుకోవచ్చు. నెల్లూరులోని ఈ చిన్నారులు తమ కలలను సాకారం చేసుకునేందుకు అన్నివిధాల అండగా నిలుస్తాం' అని పోస్ట్ చేశారు. అలాగే అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన వెంకటరామ శ్రీకాంత్ అనే - మిగతా3లో



## సీఎం రేవంత్ విసిరిన సవాల్ కేటీఆర్‌కు అర్థం కానట్టుంది

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు అర్థం కానట్టుందని మంత్రి సీతక్క అన్నారు. అసెంబ్లీలో చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి సీవాల్ విసిరింది కేటీఆర్‌కు కాదని.. కేసీఆర్‌కు అని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత హోదా ఉన్న కేసీఆర్ చర్చకు రావాలన్నారు. భారత రాష్ట్ర సమితి ఇప్పటికే చచ్చిపోయిందని.. కేటీఆర్ నాయకత్వాన్ని ఆయన చెల్లెలే అంగీకరించడం లేదన్నారు. కేటీఆర్ తమ నాయకుడే కాదని ఆమె ఓ

# హాస్పిటల్ నుంచి కేసీఆర్ డిశ్చార్జ్



- 'రాష్ట్రంలో పంటలెట్ల ఉన్నయి? వానలు పడుతున్నాయా? నీళ్లు అందుతున్నాయా?'
- నీటి వాటాల సంగతి తేలుస్తా!
- పలకరించేందుకు వచ్చిన నేతలతో కేసీఆర్

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ యశోద దవాఖాన నుంచి డిశ్చార్జ్ అయ్యారు. నందీనగర్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. రొటీన్ హెల్త్ చెకప్‌లో భాగంగా గురువారం సాయంత్రం (ఈ నెల 3న) కేసీఆర్ యశోదా హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారు. బ్లడ్ షుగర్, సోడియం లెవెల్స్ మానిటర్ చేయడం కోసం ఒకటి, రెండు రోజులు హాస్పిటల్‌లో చేరాల్సిందిగా డాక్టర్లు సూచించారు. ఆరోగ్యపరంగా కేసీఆర్‌కు పెద్దగా ఇబ్బందులేమీ లేవని తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్షల అనంతరం శనివారం ఉదయం హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యారు. 'కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయబద్ధమైన నీటి వాటాపై నేను త్వరలోనే స్పందిస్త.. ప్రజల - మిగతా3లో




## ట్రంప్ సుంకాలకు మోదీ తలొగ్గుతారు.. రాసి పెట్టుకోండి

- అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ పటిష్ఠ విధానాలను కలిగిఉంది
- 90 రోజుల విరామం తర్వాత అది అమల్లోకి రాకుండా ఉండేందుకు వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి భారత్ ప్రయత్నిస్తోంది.
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు

## ప్రజలు ఆ రెండు పార్టీలకు

# బుద్ధి చెబుతారు

- ఆ రెండు పార్టీలపై తెలంగాణ బీజేపీ కొత్త బాస్ ఫైర్
- పార్టీ కోసం నేను చేసిన కృషికి దక్కిన గౌరవం ఇది
- నాకు ఇచ్చింది పదవి కాదు.. కార్యకర్తకు దక్కిన గౌరవం
- నలభై ఐదు లక్షల మంది కార్యకర్తలు ఉన్న పార్టీ బీజేపీ
- ప్రజలు ఇచ్చిన నమ్మకాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నిలబెట్టుకోలేదు
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు రైతులను, విద్యార్థులను, నిరుద్యోగులను, మహిళలను మోసం చేశాయి



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

'పార్టీ కోసం నేను చేసిన కృషికి దక్కిన గౌరవం ఇది. నాకు ఇచ్చింది పదవి కాదు.. కార్యకర్తకు దక్కిన గౌరవం. లక్షలాది మంది కార్యకర్తలకు దక్కిన గౌరవం ఇది' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా రామచందర్ రావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నలభై ఐదు లక్షల మంది కార్యకర్తలు ఉన్న పార్టీ బీజేపీ అని తెలిపారు. ఎంతోమంది కార్యకర్తల త్యాగం ఉందన్నారు. దేశవ్యాప్తంగా 14 కోట్ల సభ్యత్వం ఉన్న పార్టీ బీజేపీ అని చెప్పుకొచ్చారు. ప్రజలు ఇచ్చిన నమ్మకాన్ని కాంగ్రెస్, - మిగతా3లో

# మామిడి రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

పల్ప్ ఫ్యాక్టరీ లను సిండికేట్ చేసి కుట్రలు చేస్తున్న వైసీపీ

రైతు కష్టాన్ని దోచుకోవడం దుర్మార్గం

తప్పుడు ఆరోపణలు చేసేందుకే జగన్ రెడ్డి యాత్ర

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే అమర్



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 05:**

మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పలమనేరు శాసన సభ్యులు అమర్నాథరెడ్డి స్పష్టం చేశారు. పలమనేరు నియోజకవర్గంలోని పెద్ద పంజాణి మండలం కరసనపల్లి నందు సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు... ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనకు ఘన స్వాగతం తెలియజేసి నీరాజనాలు పలికారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది పాలనలో ప్రభుత్వం చేపడుతున్న అభి వృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలపై ఇంటింటికి చేరుకొని గ్రామస్థులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇప్పటిదాకా అందించిన ప్రభుత్వపథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణి చేశారు. ఇక స్థాని కంగా ఉన్న సమస్యలనుఅడిగి తెలుసుకొ నగా నీరు, డ్రైనేజీ, విద్యుత్‌కు సంబం ధించిన సమస్యలు ఆయన దృష్టికి రాగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మీడి యాతో మాట్లాడారు. వాతావరణ పరిస్థితులు సకాలంలో నీరు అందడంతో గత పది ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా మామిడి దిగుబడి పెరిగిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే తోతాపురి 4 లక్షల మెట్రిక్ టన్నులు మామిడి ఉత్పత్తి పెరిగిందన్నారు. దీంతో మార్కెట్‌పై ప్రభావం పడడంతోనే రేటు కొంతవరకు తగ్గిందని భావించి ప్రభుత్వం ముందుగానే అంచనా వేసి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో కిలోకు రూ. 4 సబ్సిడీని నేరుగా వారికే చెల్లిస్తోందన్నారు. మామిడి పల్ప్ ఫ్యాక్టరీలను సిండికేట్‌గా మార్చి రైతుల నుంచి తక్కువ ధరకు పంట కొనుగోలు చేసేందుకు వైసిపి కుట్రలు చేస్తున్నదన్నారు. ఈ కుట్రలకు మద్దతు తెలిపేందుకే జగన్ రెడ్డి చిత్తూరు జిల్లాకు వస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. పీఎల్ఆర్, సిజిఆర్ ఫుడ్స్ ఫ్యాక్టరీలు ఎవరివో చెప్పాలని కిలో రూ.3 లకే కొనుగోలు చేస్తున్న విషయం వాస్తవం కాదా అన్నారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటూ వారిని ఆదుకుంటుంటే వైసిపి నేతలు సిండికేట్ గా మారి రైతుల కష్టాన్ని దోచుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గం అన్నారు. తన హయాంలో ఏమా త్రం పట్టించుకోని జగన్ రెడ్డి కష్ట సమయాల్లో కిలోకు రూ. 4 ఇచ్చి ఆదుకుంటున్న ఈ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేసేందుకే మామిడి రైతులపై దండయాత్రకు బయలుదేరు తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, నాయకులు ఆనంద్, చలపతి, మురహరి రెడ్డి, శ్రీరాములు, సుధాకర్ రెడ్డి, రోజా రెడ్డి, నాగరాజు రెడ్డి, కృష్ణారెడ్డిలతో పాటు జనసేన నాయకులు పాల్గొన్నారు.

# సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 05:**

శ్రీకాళహస్తి తొట్టంబేడు మండలం తెలుగు దేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సూచన మేరకు తొట్టంబేడు మండలం బసవయ్య పాలెం పంచాయతీలోని జ్ఞానం కండ్రిగ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం పర్యటించడం జరిగింది. వివిధ సమస్యల మీద నోట్ చేసుకొని మా ఎమ్మెల్యే తెలియజేయడం జరిగినది. అదేవిధంగా ఈ కార్యక్రమంలో ఎంత మేరకు ప్రభుత్వ కార్యక్రమాలు అందుతున్నాయి ప్రజల నుంచి స్పందన లభించింది. ముఖ్యంగా తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా గ్యాస్ సబ్సిడీ మీద ప్రజలు కుటుంబాలు హర్షాతి రేఖలు వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు రావిళ్ళ మునిరాజు నాయుడు, రామానాయుడు, రాజేందర్, వెంకటాచలం, మంగారెడ్డి, ఓబుల్ రెడ్డి, కమల్ కుమార్, బూత్ ఇంచార్జ్ రామ్మూర్తి, నాదముని, లెక్కలు మురళి నాయుడు, జై చంద్ర నాయుడు, చలపతి, కొన్నలి రమేష్, మునిరత్నం, పూడి శేషం నాయుడు, నేలబల్లి సునీల్, భాస్కర్, గున్నయ్య, చెంచయ్య, రమణారెడ్డి, కనపర్తి శంకర్ నాయుడు, మేరీ మీ వెంకటసుబ్బయ్య, ఉన్నాం ప్రసాద్ నాయుడు, కంచనపల్లి మోహన్, శివనాథ్ పాలెం మోహన్ నాయుడు, గోపి, చెంగంనాయుడు, సచివాలయం సిబ్బంది , అధికారులు తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# మన పర్యావరణం మన బాధ్యత కార్యక్రమం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 05:**



శ్రీకాళహస్తి పవన్ కళ్యాణ్ ఆశయాలే మా ఆశయాలు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆశయంలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో మనపర్యావరణం మన బాధ్యత అనే కార్యక్రమం ద్వారా నెలలో మొదటి శనివారం, మూడవ శనివారం రోజున మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మొదటి శనివారం అయినందున తొట్టంబేడు మండలం గురుకులపాలెంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్య క్రమంలో తొట్టంబేడు మండల జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, పేట చిరంజీవి, ప్రదీప్ కుమార్, ప్రభాకర్, మనీ, చందు, వంశి, చందు. తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 05:**



శ్రీకాళహస్తి హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం శ్రీకాళహస్తి పట్నంలోని కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరిగింది. ముందుగా న్యాయమూర్తులు చేతుల మీదుగా మెడికల్ క్యాంప్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ లోక్ అదాలతో ఇచ్చే తీర్పు సుప్రీం కోర్టు తీర్పుతో సమానం అన్నారు. దీనికి తిరిగి అప్పీల్ లేదని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షదారులు ఉపయోగించు కోవాలని పిలుపునిచ్చారు. అలాగే కోర్ట్ యందు పెండింగ్ లో ఉన్న అన్ని రకాల రాజీపడని క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు,మోటార్ ప్రమాదపరిహారం కేసులు, లేబర్ కేసులు,సివిల్ కేసులు, కోర్టు వరకు వెళ్లని రాజీ పడదగిన తగాదాలు లోక్ అదాలత్ తో పరిష్కరించుకోవచ్చు. లోక్ అదాలత్ అవార్డు అప్పీలు లేని అంతిమ తీర్పుఅని తెలిపారు. ఈ కార్యక్రమంలో 12వ అదనపుజిల్లా జడ్జి శ్రీనివాస్ నాయ క్,సీనియర్ సివిల్ జడ్జ్ బేబీ రాణి, జూని యర్ సివిల్ జడ్జ్ శ్రీనివాస్, న్యాయవాదులు, అన్నిశాఖల ఉన్నతాధికారులు, బ్యాంక్ సిబ్బంది, పారా లీగల్ వాలంటరీలు, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# మామిడి ప్రాసింగ్ యూనిట్లుకి అన్ని విధాలుగా మద్దతు ఇవ్వటానికి రాష్ట ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

మామిడి ప్రాసింగ్ యూనిట్లు మామిడి పండ్లు కనీస ధర కు రైతుల వద్ద కొనుగోలు చేయాలి.

రాష్ట ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ : చిరంజీవి చౌదరి

మామిడికాయ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

మామిడి రైతులు- పల్ప్ పరిశ్రమ కలిసి పనిచేయాలి : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 5:**

మామిడి ప్రాసింగ్ యూనిట్లు మామిడి పండ్లు కనీసధర కు రైతులవద్ద కొనుగోలు చేయాలిఅని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సి పల్ సెక్రెటరీ చిరంజీవిచౌదరి పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు చిత్తూరు ఉమ్మడి జిల్లాలో మామిడికాయ గుజ్జు పరిశ్రమ యాజమాన్యంతో సమావేశం, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ఎండి శేఖర్ బాబు,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ మాట్లాడుతూ మామిడికాయ రైతులను ఆదుకోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకచర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వచ్చే బడ్జెట్లో మ్యాంగో బోర్డు మ్యాంగో బోర్డు చిత్తూరు నందు ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదికలు అందజేయడం జరిగిందని తెలిపారు. పల్ప్ ప్రాసెసింగ్‌లో 8 కోట్లు బకాయిలు విడుదల చేయడానికి ప్రభుత్వంపరిశీలనలో ఉన్నదని తెలిపారు. ప్రాసెసింగ్ యూనిట్లుకి కూడా మామిడి ప్రాసింగ్ ఉత్పత్తుల పై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీ రద్దు చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్‌కి రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఇప్పటికే లేఖ రాశారు. మామిడి రైతులు, ప్రాసెసింగ్ యూనిట్లు యజమానుల సమస్యలు శాశ్వతంగా పరి ష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చాలా గట్టిగా పని చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన మామిడి రైతుల సమస్యల సంక్షోభ నివారణకు మామిడి ప్రాసింగ్ యూనిట్లు యజమానులు ముందుకురావాలి. మామిడి ప్రాసింగ్ ఉత్పత్తులను పెద్ద పెద్ద ఫంక్షన్లో, ఇతర కార్యక్రమాల్లో కొని పంపిణీ చేసేలా ప్రాసెసింగ్ యూనిట్లు యజమానులు తమ మార్కెట్ల విస్తరణ వైపు దృష్టి సారించాలి. మీ సమస్యలు పరిష్కారం కొరకు ఏ సమయం లోఎప్పుడూ కావాలన్న జోక్యం చేసుకుని ప్రాసెసింగ్ యూనిట్లుకి మద్దతు సాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగాఉంది. తెలిపారు. అంత కుమునుపు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఇప్పటి వరకూ 1.15 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి కొనుగోలు జరిగిందని ఇంకా 1.70లక్షల మెట్రిక్‌టన్నుల వరకూ ఉత్పత్తి ఇంకా రావాల్సి ఉందని తెలిపారు. కంపెనీల యాజమాన్యులు మాట్లాడుతూ మ్యాంగో పల్ప్ పై విధిస్తున్న జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించేలా అధి కారులు కృషి చేయాలని, మద్యాహ్న భోజనం పథకంలో భాగంగా విద్యార్థులకు మూడు రోజుల పాటు మ్యాంగో జ్యూస్, పవిత్ర దేవాలయాలలో, భక్తులకు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని పరిశ్రమల ప్రతినిధులు సమావే శంలో దృష్టికి తీసుకువచ్చారు. అయితే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పోషకాహారంగా గుడ్డును అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ అంశంపై అధ్యయనం చేసి తదుపరి ఆలోచన చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ చిరంజీవి చౌదరితో కలిసి,జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో మ్యాంగో ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యార్థి, ఎం.డి.శేఖర్, డి.డి. హార్టికల్చర్ మధుసూదన్ రెడ్డి, ఫుడ్ అండ్ ఇన్స్, సిద్ధార్థ ఆగ్రో, సువేరా, మంజునాథ, ఎఫ్ - త్రీ, సన్ గోల్డ్, జైన్, టోపో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆర్ ఎం ఎన్ ఫుడ్ ప్రొడక్ట్స్, నేచుర ఫుడ్స్, గళ్ళ ఫుడ్స్, జయ భారతి, వివిధ గుజ్జు పరిశ్రమల కంపెనీలు తదితరులు పాల్గొన్నారు.



# సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన గంధమనేని



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 05:**

ఎస్ఆర్ పురంమండలం శెట్టివానత్తం పంచాయతీ శనివారం ఉదయం సుపరి పాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని ఎస్ ఆర్ పురంమండల పార్టీ అధ్యక్షుడు గంధ మనేని జయశంకర్ నాయుడు ప్రారంభించారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆదేశాలతో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం ప్రభుత్వం అధి కారంలోకి వచ్చి సంవత్సరంపూర్తిలో ఏఏ సంక్షేమపథకాలు వచ్చాయి. అని ప్రతి ఇంటివద్ద గ్రామస్తులనుఅడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన ఒక సంవత్సరంలో తల్లికి వందనం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు దీపం పథకం యువతకు ఉద్యోగాల రైతు సంక్షేమం అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ రాయలసీమకు నవోదయం కర్నూలు హైకోర్టు బెంచి అసెంబ్లీలో తీర్మానం 3873 కోట్లతో హంద్రీనీవా ప్రాజెక్టుకు పనులు ఆరు లక్షల మూడు ఎకరాలకు నీరు ఓర్వకల్లు కొప్పర్తి పారిశ్రామికవాడలు డ్రిప్ ఇరిగేషన్ వంటి అనేక కార్యక్రమాలను తెలుగుదేశ ప్రభుత్వంచేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి కుమార్ నియో జకవర్గ,మాజీ ఎంపీటీసీ వేమన నాయుడు, పైనేని మురళి,మండల ఉపాధ్యక్షుడు నిరంజన్ రెడ్డి,రఘునాథ రెడ్డి,రవీంద్రా రెడ్డి,మునిరత్నం రెడ్డి, యువత ప్రధాన కార్యదర్శి బాబు,మాజీ సర్పంచ్ కుప్పయ్య,నోమేష్ రెడ్డి,విజయ్ రెడ్డి నరేష్ ప్రసాద్ లోకేష్,సురేష్ ఆర్టిఐ జిల్లా అధ్యక్షుడు జయరాజ్ నరేష్ ఉదయ్ కుమార్ రామిరెడ్డి,సిద్దయ్య శెట్టి, చిన్నబ్బ రాజు,పుల్లూరు దాము పుల్లూరు సోము, దసరాజు మధు పైనేని ధనుంజయ నాయుడు ,బాబు నాయుడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మామిడి రైతులపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు టిడిపి జిల్లా నాయకులు

రైతులు ఆదుకోవడంలో ముందంజలో కూటమి ప్రభుత్వం ఉంది జిల్లా టిడిపి నాయకులు



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 05:**

మామిడి రైతుల గురించి మాట్లాడే అర్హత వైసిపిపార్టీకి లేదని జిల్లాటిడిపి కార్యదర్శి కృష్ణమ నాయుడు, మాజీ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్ యాదవ్ అన్నారు. గంగాధర నెల్లూరు మండలంలో మీడియాతో మాట్లాడుతూ రైతులను ఆదుకోవడానికి ప్రత్యేకంగా తన్నుకు 4000 రూపాయలను అందించిన ఘనత టిడిపి ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. వైసిపి నాయ కులు మామిడి రైతులపై అనవసరమైన మాటలు చేయడం తగదని అన్నారు. గత ప్రభుత్వంలో వైసిపి ఎన్నడూ రైతులకు మేలు చేయలేదని మండిపడ్డారు నేడు మామిడి రైతులను ఆదుకోవాలని అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చేన్నాయుడు ఆధ్వర్యంలో రైతులను ఆదుకునే కార్య క్రమాలు చేపట్టారని అన్నారు. వైసిపి నాయకులు రైతులపై అనవసర మాటలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లెపల్లి గ్రామకమిటీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కలసిన డీఎస్పీ, హౌసింగ్ డీఈ

**పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 05:**



పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని పలమనేరు డిఎస్పీ దేగల ప్రభాకర్, హౌసింగ్ డిఈలు శనివారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా కలవడానికి సీఎం బందోబస్త్ కారణంగా వీలు కుదరకపోవడంతో డిఎస్పీ తన సిబ్బందితో కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక పలమనేరు హౌసింగ్ డీఈగా విధుల్లో చేరిన వినోదకుమార్ సైతం తనసిబ్బందితో కలసివచ్చి ఎమ్మెల్యేను మర్యాద పూర్వకం గా కలిశారు. ఇక్కడ డిఈగా పనిచేస్తోండిన స్వామి దాస్ పదవివిరమణ పొందడంతో చిత్తూరు జిల్లాకేంద్రంలో పనిచేస్తున్న వినోద్ కుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో పలమనేరు, గంగవరం రూరల్ సీఐలు నరసింహ రాజు, మురళీ మోహన్, హౌసింగ్ ఏఈ లు పాల్గొన్నారు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్ఆర్ పురం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడుగా శ్యామ్ రాజ్

**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 05:**



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలపార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడుగా 49కొత్తపల్లిగ్రామా నికి చెంది న పి శ్యామ్ రాజును నియమించినట్లు మాజీడిప్యూటీ సీఎం నారాయణ స్వామి నియోజకవర్గం ఇన్చార్జి కృపాలక్ష్మి ఆదేశాల, మేరకు పార్టీకార్యా లయంలో శనివారం ఒక ప్రకటనవిడుదలచేసినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు పదివిరావడానికి కృషి చేసిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి చిత్తూరు గంగాధర నెల్లూరు వైసీపీ ఇన్చార్జులు ఎంసీ విజయా నందరెడ్డి, కృపాలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంఉంచి తనకు మండలపదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి జీవితాంతంరుణపడి ఉంటానని అలాగే తన వంతు పార్టీకి కష్టపడి,పనిచేసి పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తానని తెలిపారు.

# మెగా పిటిఎంలో విట్నస్ అధికారి నియామక ఉత్తర్వులు రద్దు చేయాలి

యుటిఎఫ్ పీలేరు డివిజజిన్ శాఖ డిమాండ్

**పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 05:**

అన్నమయ్యజిల్లా పీలేరు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పాఠశాలలో ఈనెల 10వతేదీ జరిగే మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంలో విట్నస్ అధికారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులే నియమించుకుని వారిచేత వీడియోలు తీయించి అప్లోడ్ చేయాలని సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరక్టర్ ఇచ్చినఉత్తర్వులను తక్షణంరద్దు చేయాలని యుటియఫ్ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కే సదాశివరెడ్డి, జిల్లాఅధ్యక్షులు జి శివారెడ్డి, కార్యదర్శులు అక్రమ భాష, మహేంద్ర, విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి విద్యార్థుల విద్యాభివృద్ధి మీద, పాఠశాలల్లో ఉన్న మౌళిక సదుపాయాల మీద మాట్లాడు కోవడా నికి17 రకాల కమిటీలు, ఫోటోల అప్లోడ్‌లు, విట్నస్ అధికారులు ఇంత తతంగం అవసరమా? వారు ప్రశ్నించారు. పి.టి.ఎం.కార్యక్రమాన్ని డాక్యుమెంట్ కార్యక్రమంగా మార్చడంసరికాదని, విద్యార్థుల విద్యాభివృద్ధి గురించి చర్చిం చేకార్యక్రమంగా దీనిని మార్చాలని యుటియఫ్ కోరుతున్నదని వారు పేర్కొన్నారు. బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేస్తామని చెప్పిన పాఠశాల విద్యా శాఖ దానికి భిన్నంగా బోధనేతర కార్యక్రమాలకు ఉపాధ్యాయులను వినియోగి స్తుందని వారు విమర్శించారు. ఇదే వైఖరితో ప్రభుత్వం ముందుకు వెళితే భవిష్య త్తులో తగిన గుణపాఠం చెబుతా మని వారు హెచ్చరించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోని నాణ్యమైన విద్య ప్రధానోపాధ్యాయులు పోతురాజు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 05:**

శ్రీకాళహస్తి ఈశ్వరయ్య గిరిజనకాలనీలో మోడల్ ప్రైమరీ పాఠశాల పరిధిలోని ఈశ్వరయ్య గిరిజన కాలనీ భీమవరం ఎస్సీ కాలనీ గిరిజనకాలనీలోని పాఠశాలకు వచ్చే పిల్లలను ఇంటింటా తిరిగి పాఠశాలలో ప్రభుత్వంకల్పించే ఉచిత మధ్యాహ్నం భోజనం పథకం సర్వేపల్లి రాధా కృష్ణ జాకెట్టు టెక్ట్ బుక్స్, యూనిఫామ్స్, తల్లికి వందనం ఉచిత రవాణా సౌకర్యాలు తదితర పథకాలు గురించి వివరించారు. తల్లిదండ్రులను ఈశ్వరయ్య గిరిజన కాలనీ మోడల్ ప్రైమరీ పాఠశాలలో ప్రవే శంకొరకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోతురాజు, ఉపాధ్యాయులు యోగేశ్వరరావు, సిఆర్ఎంలు కృష్ణయ్య, ప్రదీప్ కుమార్, ప్రగతి స్వచ్ఛంద సంస్థ శ్రీకాళహస్తి మండల కోఆర్డినేటర్ చంద్ర శేఖర్, తల్లిదండ్రులు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు, విద్యార్థులతో కలిసి గ్రామంలో అవగాహన కలిగించారు.

# పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

**చౌడేపల్లి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 05:**



మండలంలోని శట్టిపేట పంచాయతీ మేకల చిన్నపల్లిలో నిరంతరం వీధిదీపాలు వెలుగుతున్నాయి రాత్రులు మాత్రమే వెలగాల్సిన వీధిదీపాలు పగలంతా వెలుగుతున్నాయి విద్యుత్ విని యోగాన్ని తగ్గించి ప్రభుత్వానికి తోడ్పాటు, ఇవ్వాలని ప్రభుత్వం అధికారులు తెలుపుతుంటే కింది స్థాయి, అధికారుల నిర్లక్ష్యం మూలంగా రాత్రింబవళ్లు విద్యుత్ దీపాలు వెలుగుతూ ప్రభు త్వ లక్ష్యాన్ని నీరు కారుస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రాత్రులు మాత్ర మే విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్‌కు ఆమోదం

-మొదటిపేజీ తరువాయి

తెలిపింది. మందడంలో వివాంతా, హిల్టన్ హోటల్స్, తుళ్లూరులో హయత్ రీజెన్సీ, లింగాయపాలెం నోవోటెల్ సమీపంలో ఈ కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి 2.5 ఎకరాల చొప్పున కేటాయిస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుంది. క్వాలిటీ బేస్డ్ సెలెక్షన్ ప్రాతిపదికన ఈ కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి అథారిటీ ఆమోదం తెలియచేసింది. రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనులకు కష్ణానది నుంచే ఇసుకను డ్రెడ్జింగ్ చేసుకునేందుకు సీఆర్డీఏకి అనుమతి మంజూరు చేసింది. ప్రస్తుతం రాజధానిలో రూ.49,040 కోట్ల విలువైన పనులు జరుగుతున్న రీత్యా రానున్న రెండేళ్లలో వివిధ ప్రాజెక్టులకు 160 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం అవుతుందని సీఆర్డీఏ అంచనా వేసింది. రాజధాని నిర్మాణానికి అవసరం అయ్యే ఇసుకను ప్రకాశం బ్యారేజీ ఎగువన డీసిల్టింగ్ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని జలవనరుల శాఖను సీఆర్డీఏ కోరింది. రెండేళ్ల పాటు రాజధాని ప్రాజెక్టులకు అవసరమైన ఇసుకను తవ్వుకునేందుకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదాన్ని తెలియచేసింది. ఇసుక డీసిల్టేషన్ ప్రక్రియకు రూ.286 కోట్ల మేర వ్యయం కానున్నట్టు అథారిటీ సమావేశంలో అధికారులు తెలిపారు.

రాజధానిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులు

అమరావతి రాజధానిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై మంత్రుల సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయాలకు కూడా సీఆర్డీఏ అథారిటి ఆమోదాన్ని తెలిపింది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు 2 ఎకరాలు, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు 2 ఎకరాలు, స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు 5 ఎకరాలు, ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్‌కు 0.495 ఎకరాలు, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడెమీకి 12 ఎకరాలు, ఎంఎస్‌కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడెమీకి 12 ఎకరాలు కేటాయిస్తూ సీఆర్డీఏ అథారిటీ అమోదం ఇచ్చింది. అలాగే ఆదాయపు పన్ను శాఖకు 2 ఎకరాలు, ఏపీ గ్రామీణ బ్యాంక్‌కు 2 ఎకరాలు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 0.40 ఎకరాలు, ఎస్‌ఐబీకి 0.50 ఎకరాలు, బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్‌కు 0.50 ఎకరాలు, కిమ్స్ ఆస్పత్రి, మెడికల్




కళాశాలకు 25 ఎకరాలు, భారతీయ జనతా పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం 2 ఎకరాలను, బాసిల్ వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు 4 ఎకరాలను కేటాయించేందుకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదాన్ని ఇచ్చింది. అలాగే గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్, అంబికా గ్రూప్‌లకు గతంలో కేటాయించిన 1.40 ఎకరాలను రద్దు చేస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుంది. రాజధాని ప్రాంతంలోని మంగళగిరి సమీపంలో ఉ%-%15 రహదారిపై నాలుగులేన్ల ఆర్వోబీ నిర్మాణానికి సీఆర్డీఏ అథారిటీ ఆమోదాన్ని తెలియచేసింది. రాజధాని అమరావతిలో స్ఫూర్తినిచ్చేవారి స్మారక చిహ్నాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మేరకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలను ఏర్పాటు చేయాల్సిందిగా అధికారులకు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల్లో నిర్మించే ఎకో పార్కులకూ మంచి పేర్లను పెట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కొత్త ప్రాజెక్టుల కోసం అధికారులు ఎలాంటి బేషజాలు లేకుండా ప్రయత్నాలు చేయాలని సూచించారు. అమరావతి రాజధాని రాష్ట్ర ప్రజల సెంటిమెంట్ అని, గతంలో రాష్ట్ర సచివాలయం వేగంగా రికార్డు సమయంలో నిర్మించామని, అదే స్ఫూర్తితో పనులు పూర్తి చేయాలని అన్నారు. అమరావతిలో ఎయిర్ పోర్టు నిర్మాణం విషయంలో కేంద్రంతో సంప్రదింపులు చేయాలని అధికారులకు సీఎం సూచించారు. రాజధానిలో నిర్మించతల పెట్టిన ఏ ప్రాజెక్టూ ఆలస్యం కాకుండా చూడాలన్నారు. కొత్తగా వచ్చే ప్రాజెక్టులకు అనుమతులను వేగవంతంగా ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. నిర్మాణ పనులు సరిగ్గా చేయని సంస్థలకు నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని, గడువులోగా పూర్తి చేసేలా నిర్దేశించాలని ముఖ్యంత్రి చంద్రబాబు అన్నారు.

# ఓటేసిన వారిని కాటేస్తారా?

-మొదటిపేజీ తరువాయి

రెండోది ప్రతి పక్షం, ప్రతి పక్షం బాధ్యత ప్రజలు పడుతున్న ఇబ్బందులపై గొంతుగా నిలవడం. ఇచ్చిన హామీలపై నిలదీయడం ప్రతి పక్షం బాధ్యత. అమలు కానీ హామీలపై అడిగితే కేసులు పెట్టడం, నలకమందం అనడం సంప్రదాయం కాదు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇద్దరు హామీలు ఇచ్చారు. నెలలు గడుస్తున్నాయి. ఆ హామీలు ఎప్పుడు అమలు చేస్తారు?" అంటూ బొత్స ప్రశ్నించారు. 40 శాతం ఓట్లు ఉన్న మాకు ప్రజలు తరపున అడిగే హక్కు ఉంది. జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామీణ స్థాయిలో ఈ మోసాలపై నిలదీస్తాం. ఏడాది పాలనలో ఉద్యోగాలు తీసి.. నిరుద్యోగ భృతి మాట లేకుండా చేశారు. ఈ ఏడాది నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి రూ.36 వేలు ఎప్పుడు ఇస్తారు?. మా ప్రభుత్వంలో హామీల అమలు కోసం మేనిఫెస్టోను జేబులో పెట్టుకుని తిరిగితే.. కుటమి నాయకులు అమలు చేయలేక వారి మేనిఫెస్టోను బిరువాలో పెట్టారు." అంటూ బొత్స దుయ్యబట్టారు.

"పువ్వు పుట్టిగానే పరిమళించినట్లు లోకేష్ మంత్రి అయ్యారు. తండ్రికి మించిన అబద్ధాలు లోకేష్ మాట్లాడుతున్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమం "పేరు గొప్ప.. ఊరు దిబ్బ" అన్నట్లు ఉంది. ఏడాది పుర్తి అయినా కేంద్రం ఇచ్చిన సాయం తప్ప రాష్ట్ర హామీ ఏమైంది?. సభ సాక్షిగా మే నెలలో ఇస్తామని చెప్పిన మంత్రి లోకేష్ ఏ మే నెలలో ఇస్తారో చెప్పాలి. వైద్య విద్యార్థులపై ఆడ పిల్లలు, చిన్న పిల్లలు అని చూడకుండా లాఠీఛార్జ్ చేయడం ప్రభుత్వ ధర్మం కాదు. ఏమి



చేసిన అడిగే వారే లేరని వ్యవహరించడం సరికాదు. మనిషికి ఉన్న ఆశపైనే మోసపురిత రాజకీయాలు చంద్రబాబు చేస్తారు. ..చంద్రబాబు ఎప్పుడూ రైతులు, మహిళాలనే మోసం చేసి ముఖ్యమంత్రి అవుతున్నారు. రాష్ట్రంలో రైతులకు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర లేదు. సరైన గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత ప్రభుత్వనిదే. వాటిపై మాట్లాడితే కేసులు పెట్టి తాట తీస్తామని వ్యాఖ్యలు చేస్తారా?. ఉపాధి హామీలో ఎప్పుడైనా మూడు నెలల బకాయిలు చెల్లించకుండా ఉంచారా?. రెక్క ఆడితే కానీ డొక్కా ఆడాని వారిని ఇబ్బందులకు గురి చేస్తారా?. మంత్రి పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారు" అంటూ బొత్స నిలదీశారు.

**కూటమి సర్కార్ నయ వంచన: కన్నబాబు**

మాజీ మంత్రి కురుసాల కన్నబాబు మాట్లాడుతూ.. మోసపోయింది ప్రజలు తప్ప.. చంద్రబాబు కాదు. ఓటేసిన వాడిని కాటేసిన వారు ఎవరైనా ఉన్నారా అంటే అది చంద్రబాబే.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పథకాలు కాపీ కొట్టి.. పక్క రాష్ట్రాల్లో కొన్ని కాపీ కొట్టి నయవంచన చేశారు. 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని చేతులెత్తేసిన ఘనత చంద్రబాబుది. ఎన్నికల సమయంలో హామీలు అమలు చేస్తామని బాండ్లపై సంతకాలు చేసిన హామీ ఏమయింది?. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం ద్వారా ప్రజలను చైతన్య పరచాలి. ఏడాది పాలనలో ఏవిధంగా సంక్షేమ పథకాలు అమలు చేయలేదో ప్రజలకు వివరించాలి. సంక్షేమ పథకాలు అమలు చేసామని చెప్పిన చంద్రబాబును ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు. ఎన్నికల్లో ప్రజల్లో మోసం చేసే గెలిచిన నాయకుల్లో చంద్రబాబు గిన్నిస్ రికార్డులు సాధిస్తారు. ఎన్నికల మేనిఫెస్టోలో బాబు ష్యూరిటీ అని చంద్రబాబు ప్రమాణం చేశారు. తల్లి వందనం కార్యక్రమంలో సర్పంచ్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి పథకం రాకుండా చేశారు. రాష్ట్రంలో లక్షలాది మహిళాలకు తల్లికి వందనం రాలేదు అన్నది నిజం. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పచ్చి అబద్ధాలు ఆడి అధికారం దక్కించుకున్నారు. గతంలో కూడా ఆనాడు చంద్రబాబు 89 వేల కోట్లు రుణ మాఫీ చేయ్యల్సి వస్తే 15వేల కోట్లు మాత్రమే రుణ మాఫీ చేశారు. మీరు కనబడితే తొలి అడుగు కాదు తొలిసారిగా మిమ్మల్ని నిలదీస్తారు ప్రజలు. మా ప్రభుత్వంలో ఇచ్చిన సంక్షేమన్ని నేరుగా ఇంటికి వెల్లి తెలియజేశాం. మీరు చేసిన ప్రతి అరాచకాన్ని 2.0 లో ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకుంటారు" అని కన్నబాబు చెప్పారు.

## కేటీఆర్, హరీశ్ సెకండ్ బెంచ్ లీడర్స్..

# వీళ్ల జోక్యం అవసరం లేదు

తెలంగాణలో రాజకీయాలు ప్రస్తుతం హాట్ హాట్?గా కొనసా గుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి రైతు సంక్షేమంపై నిన్న చేసిన సవాల్?పై కేటీఆర్ స్పందించడం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై ఇప్పటికే మంత్రి సీతక్క సహా పలువురు స్పందించగా, తాజాగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రియాక్ట్ అయ్యారు. ఈ క్రమంలో కేసీఆర్, రేవంత్ లాంటి ఫస్ట్ బెంచ్ నాయకుల మధ్య జరిగే చర్చల్లో కేటీఆర్, హరీశ్ రావు వంటి సెకండ్ బెంచ్ నాయకుల జోక్యం అవసరమా అని ఎద్దేవా చేశారు. ఎందుకంటే రేవంత్ రెడ్డి అసెంబ్లీకి రమ్మని కేసీఆర్?కు సవాల్ చేస్తే, కేటీఆర్ క్లబ్?కు రా అని సమాధానం ఇస్తున్నారని గుర్తు చేశారు. ఇది వారి మధ్య ఉన్న రాజకీయ నైపుణ్యాన్ని స్పష్టంగా చూపిస్తుందన్నారు జగ్గారెడ్డి. కేసీఆర్ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా, పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేశారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ జాతీయ పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈ ఇద్దరి



మధ్య రాజకీయ పోరు ఎప్పుడూ ఉంటుంది. కానీ వీరి మధ్యలో కేటీఆర్ ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు.

**కేసీఆర్ వైఖరి ఏంటి..**

అంతేకాదు కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేందుకు గతంలో ఆంధ్ర నాయకులు, ఆంధ్ర ప్రజలపై కూడా తీవ్ర విమర్శలు చేశారని జగ్గారెడ్డి గుర్తు చేశారు. ఆంధ్రోళ్లను దొంగలని, నీళ్లను ఎత్తుకెళ్లారని ఎన్నో అన్నారని చెప్పారు. కానీ కేసీఆర్ సీఎం అయిన తర్వాత జగన్‌మోహన్ రెడ్డిని ఎందుకు ఇంటికి పిలిచాడని పేర్కొన్నారు. ఈ విషయంలో కేసీఆర్ రాజకీయ వైఖరి ఏంటో స్పష్టంగా తెలుస్తుందని జగ్గారెడ్డి తెలిపారు.

**ఉద్యమ సమయంలో కూడా..**

రేవంత్ రెడ్డి సవాళ్లపై కేటీఆర్ ప్రెస్ మీట్‌లు రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపవన్నారు. కేటీఆర్ రాజకీయంగా రేవంత్‌తో సమానంగా తలపడాలంటే, బీఆర్ఎస్ ప్రతిపక్ష హోదాను కేసీఆర్ నుంచి తీసుకుని మాట్లాడాలని జగ్గారెడ్డి అన్నారు. మరోవైపు తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించినట్లు గుర్తు చేశారు జగ్గారెడ్డి. సోనియా గాంధీ ఉద్యమకారులపై ఒక్క బుల్లెట్ కూడా పడకూడదని చెప్పారని, కేసీఆర్‌ను నిమ్స్‌లో చేర్చి, ఉద్యమానికి మద్దతు ఇచ్చింది కూడా కాంగ్రెస్ అని వెల్లడించారు. చివరకు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కూడా కాంగ్రెస్ పార్టీనేనని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

## రండి.. కలిసికట్టుగా ముందుకు సాగుదాం

-మొదటిపేజీ తరువాయి

చెప్పుకొచ్చారు. ఫోక్సో చట్టం, జువెనైల్ చట్టాలు మన ప్రగతిశీల సాధనాలుగా పనిచేస్తున్నాయని... అయితే ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి హాని కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. సోషల్ మీడియా ద్వారా పిల్లలపై జరిగే దురాఘతాలు, దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపకుండా దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. న్యాయం కేవలం కోర్టుల్లోనే కాకుండా ప్రతీ దశలోనూ రక్షణ ఉండాలని సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కేంద్రాలతో అన్ని ప్రక్రియల ద్వారా పిల్లలకు న్యాయం దక్కాలని.. రక్షణ కల్పించాలని తెలిపారు. 'న్యాయమూర్తులు, పోలీసు అధికారులు బాలల సంక్షేమ కమిటీలు, ఇతర అభివృద్ధి భాగస్వామ్య సభ్యులందరికీ... విజ్ఞప్తి చేస్తున్నాను. ఇలాంటి విషయాల్లో అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం. న్యాయమంటే కేవలం శిక్షలు విధించడం వరకే కాదు. బాధితుల జీవితానికి భరోసా కల్పించాలి. వారికి అవసరమైన రక్షణ, సమాజంలో తగిన గౌరవం కల్పించేలా చర్యలు తీసుకుని వారి బాల్యాన్ని తిరిగి పొందేలా చర్యలు ఉండాలి' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రజలు ఆ రెండు పార్టీలకు బుద్ధి చెబుతారు

-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ పార్టీలు నిలబెట్టుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు రైతులను, విద్యార్థులను, నిరుద్యోగులను, మహిళలను మోసం చేశాయని మండిపడ్డారు. నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి తన నిస్సహాయతను ఒప్పుకున్నారన్నారు. రైతాంగాన్ని మోసం చేస్తే వాళ్ల ఉసురు తగులుతుందని వ్యాఖ్యలు చేశారు. లోకల్‌బాడీ ఎన్నికల్లో ప్రజలు ఆ రెండు పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత రేవంత్ రెడ్డికి కనబడటం లేదని.. దీని మీద బీజేపీ చర్చకు సిద్ధమని.. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దీనిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ మీద ఆరోపణలు చేసే ముందు వారు పునరాలోచన చేసుకోవాలని హితవుపలికారు. ఖర్గే, రేవంత్ , కాంగ్రెస్ పెద్దలు తెలుసుకోవాల్సిన విషయం ఏంటంటే ఏఐసీసీ అంటే ఆల్ ఇండియా చీటింగ్ కమిటీ అంటూ కామెంట్స్ చేశారు. నెక్స్ట్ ప్రభుత్వం బీజేపీదే అని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీకి ప్రజలు 90 సీట్లు ఇవ్వబోతున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. జీహెచ్ఎంసీలో కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లు రెండేనని ఎద్దేవా చేశారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసిన ఘనత బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలదంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విరుచుకుపడ్డారు.

## హాస్పిటల్ నుంచి కేసీఆర్ డిశ్చార్జ్

-మొదటిపేజీ తరువాయి

ముందు వాస్తవాలను పెడుత' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. స్వల్ప అస్వస్థతతో సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో చేరిన కేసీఆర్ ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. శుక్రవారం తనను కలిసేందుకు వచ్చిన పార్టీ ముఖ్యనేతలతో మాట్లాడారు. ఉదయం, సాయంత్రం పార్టీ నేతలతో ముచ్చటించారు. దవాఖానలో ఉన్నా తనను కలవడానికి వచ్చిన నేతలతో రాష్ట్ర ప్రజలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపైనే ఆయన చర్చించడం గమనార్హం. ముఖ్యంగా రైతుల గురించి ఎక్కువ సమయం నేతలతో మాట్లాడారు.

పంటలెట్ల ఉన్నయి? వానలు పడుతున్నయా?

పలకరించేందుకు వచ్చిన నేతలతో కేసీఆర్ మాట్లాడుతూ 'రాష్ట్రంలో పంటలెట్ల ఉన్నయి? వానలు పడుతున్నాయా? నీళ్లు అందుతున్నాయా?' అంటూ విచారించారు. యూరియా అందడం లేదని చాలాచోట్ల రైతులు చెప్తున్నారని పలువురు నేతలు కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. అనేక ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం దాదాపు చేతులెత్తేసిందని నేతలు తమ తమ ప్రాంతాల్లో ఉన్న పరిస్థితుల గురించి చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఏనాడూ ఇలాంటి ఇబ్బందికర పరిస్థితి రాలేదని రైతులే చెప్తున్నారని, ఈసారి విత్తనాలు, ఎరువుల కొరత తీవ్రంగా ఉన్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నదని కొంత మంది నేతలు చెప్పారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయబద్ధమైన వాటా గురించి ప్రభుత్వం చేస్తున్న వితండ, అర్థం, పర్థంలేని వాదన గురించి చర్చకు రాగా దీనిపై త్వరలోనే తాను స్పందిస్తానని, ప్రజల ముందు వాస్తవాలను పెడ్తానని కేసీఆర్ చెప్పారు. తెలంగాణ ఉద్యమం, కొత్త రాష్ట్రం ఏర్పాటు.. తర్వాత ప్రభుత్వం ఎదుర్కొన్న సవాళ్లు వంటివాటిని నాయకుల వద్ద కేసీఆర్ గుర్తు చేశారు.

## జీహెచ్ఎంసీ అధికారులపై
## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం



**హైదరాబాద్:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని శ్రీకృష్ణనగర్ బస్తీలో శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించారు. స్థానిక కమ్యూనిటీ హాల్ సీ బ్లాక్‌లో ఇళ్ల ముందు పెద్ద ఎత్తున మురుగునీరు పారుతుండటంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు కిషన్‌రెడ్డి ఎదుట వాపోయారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో తీవ్ర ఆగ్రహం చెందిన ఆయన.. జీహెచ్ఎంసీ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడారు. వెంటనే మురుగు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. 'మీ ఇంటి ముందు ఇలా మురుగు ఉంటే ఒక్క నిమిషమైనా ఉండగలరా?' అని తీవ్రంగా మందలించారు. వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలన్నారు.

# బడిబాట పట్టేందుకు సాయం

-మొదటిపేజీ తరువాయి



వ్యక్తికీ ఆపదలో అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు మంత్రి లోకేష్. రోజు కూలీ చేసుకుంటూ బతికే శ్రీకాంత్ తీవ్ర అనారోగ్యంతో మంచం పట్టడంతో వాళ్ల కుటుంబ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చికిత్సకు రూ.9 లక్షల వరకూ ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పడంతో.. చివరి ప్రయత్నంగా తమ సమస్యను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న శ్రీకాంత్‌తో పాటు, ఆయన తండ్రి కూడా అనారోగ్యంగా ఉన్నారని.. దయచేసి ఆదుకోవాలని ఎక్స్ వేదికగా ఓ యూజర్ చేసిన అభ్యర్థనకు చలించిపోయిన మంత్రి లోకేష్ స్పందించారు. వీలైనంత త్వరగా సాయం అందిస్తామని తెలిపారు.

## బిజినెస్


### యూఎస్‌పై ప్రతీకార సుంకాలను విధించాలి




అమెరికా టారిఫ్ చర్యలపై భారత్ ఎట్టకేలకు స్పందించింది. వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీఓ) నిబంధనల కింద అమెరికాపై ప్రతీకార డ్యూటీలను విధించాలని ప్రతిపాదించింది. ఆటోమొబైల్ రంగంపై రక్షణ చర్యల పేరుతో అమెరికా విధించిన టారిఫ్‌లపై తాజాగా ప్రతిస్పందించింది. 26 మార్చి 2025 నుండి భారతదేశం నుంచి ప్యాసింజర్ వాహనాలు, లైట్ ట్రక్కులు, నిర్దిష్ట ఆటో భాగాలపై 25 శాతం అడ్ వాలోరెమ్ టారిఫ్‌ను విధించింది, ఇవి మే 3 నుంచి అమలులోకి వచ్చాయి. ఈ చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనల ఉల్లంఘన కిందికి వస్తాయని భారత్ పేర్కొంది. ముఖ్యంగా జనరల్ అగ్రిమెంట్ ఆన్ ట్రేడ్ అండ్ టారిఫ్ (గాట్) 1994, సేఫ్‌గార్డ్స్ అగ్రిమెంట్‌కు విరుద్ధంగా ఉన్నాయని వాదిస్తోంది. ఈ టారిఫ్‌లతో భారతదేశం నుంచి యూఎస్‌కు వెళ్లే సుమారు 2,895 మిలియన్ డాలర్ల వార్షిక ఎగుమ తులను ప్రభావితం చేస్తాయని అంచనా. ఈ టారిఫ్‌లపై చర్చల కోసం యూఎస్‌తో సంప్రదింపులు జరపాలని డబ్ల్యూటీఓను భారత్ కోరింది. దీనిపై అమెరికా స్పందించాల్సి ఉంది.

### రాజనాల బండ పై ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు

**చౌడేపల్లి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 05:**



సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండపై వెలసి ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. రాష్ట్రం నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి సత్య ప్రమాణాల కోసం పలువురు తరలివచ్చారు. కొందరు ప్రమాణాలు చేయగా మరికొందరు వాయిదా వేసుకుని వెళ్లారు. ఉదయాన్నే ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ప్రసన్న ఆంజనేయస్వామిలకు విశేషాభిషేకము అలంకరణ గావించారు. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారుల ఆధ్వర్యంలో పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు.

### 9 నెలలుగా ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది..

# రికార్డు స్థాయికి భారత్!

ప్రపంచంలో అత్యధిక ఫారెక్స్ నిల్వలు కలిగిన నాల్గవ దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. చైనా, జపాన్, స్విట్జర్లాండ్ మాత్రమే భారతదేశం కంటే ముందు ఉన్నాయి. భారతదేశ కేంద్ర బ్యాంకు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇలాంటి గణాంకాలను విడుదల చేసింది. మరోవైపు, భారతదేశ విదేశీ కరెన్సీ ఆస్తులు భారీగా పెరిగాయి. భారతదేశం గత 9 నెలలుగా ఎదురుచూస్తున్న రోజు చివరకు రానే వచ్చింది. అక్టోబర్ 2024 తర్వాత మొదటిసారిగా, దేశ ఫారెక్స్ నిల్వలు 700 బిలియన్ డాలర్లను దాటాయి. జీవితకాల గరిష్ట రికార్డును బద్దలు కొట్టడానికి భారతదేశానికి ఇంకా 2 బిలియన్ డాలర్లు అవసరం. మునుపటి విదేశీ మారక నిల్వలలో 1 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ తగ్గుదల లేకపోతే ఈ అంతరం ఇంకా తక్కువగా ఉండేది. ఈ ఏడాది భారతదేశ విదేశీ మారక నిల్వలు 58.39 బిలియన్ డాలర్లు పెరిగాయి. ప్రత్యేకత ఏమిటంటే ప్రపంచంలోని చాలా దేశాల వద్ద ఇంత మొత్తం విదేశీ మారక నిల్వలు లేవు. ప్రపంచంలో అత్యధిక ఫారెక్స్ నిల్వలు కలిగిన నాల్గవ దేశం భారతదేశం. చైనా, జపాన్, స్విట్జర్లాండ్ మాత్రమే భారతదేశం కంటే ముందు ఉన్నాయి. దేశ కేంద్ర బ్యాంకు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ గణాంకాలను విడుదల చేసింది. =దీ× డేటా ప్రకారం, దేశ ఫారెక్స్ నిల్వలు వి700 బిలియన్లను దాటాయి. జూన్ 27తో ముగిసిన వారంలో, ఇది వి4.84 బిలియన్లు పెరిగి వి702.78 బిలియన్లకు చేరుకుంది. అన్నింటికంటే, అక్టోబర్ 2024లో, భారతదేశ ఫారెక్స్ నిల్వలు వి700 బిలియన్లను దాటినట్లు కనిపించింది. అంటే దేశ ఫారెక్స్ నిల్వలు 9 నెలల గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. అయితే, దేశ ఫారెక్స్ నిల్వల ఆల్-టైమ్ హై రికార్డును బద్దలు కొట్టడానికి వి2 బిలియన్లకు పైగా అవసరం. దీనిని వచ్చే వారం



దాటవచ్చు. సెప్టెంబర్ 2024 చివరి నాటికి విదేశీ మారక నిల్వలు ఆల్-టైమ్ హై వి704.88 బిలియన్లకు చేరుకున్నాయి. మునుపటి వారంలో, విదేశీ మారక నిల్వలు వి1.01 బిలియన్లు తగ్గి వి 697.93 బిలియన్లకు చేరుకున్నాయి. మరోవైపు, భారతదేశ విదేశీ కరెన్సీ ఆస్తులు భారీగా పెరిగాయి. జూన్ 27తో ముగిసిన వారంలో ఈ నిల్వలలో అతిపెద్ద భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 5.75 బిలియన్ డాలర్లు పెరిగి, 594.82 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బిఐ శుక్రవారం(జూలై 04) తెలిపింది. డాలర్ పరంగా వ్యక్తీకరించిన విదేశీ కరెన్సీ ఆస్తులలో విదేశీ మారక నిల్వలలో ఉంచిన యూరో, పౌండ్, యెన్ వంటి యుఎస్ కాని యూనిట్ల పెరుగుదల లేదా తరుగుదల ప్రభావం ఉంటుంది. దీంతో పాటు, జూన్ 27తో ముగిసిన వారంలో బంగారు నిల్వలు 1.23 బిలియన్ డాలర్ల తగ్గుదలను చూశాయని రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. ఆ తర్వాత దేశ బంగారు నిల్వలు 84.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఎస్‌డిఆర్ 158 మిలియన్ డాలర్లు పెరిగి 18.83 బిలియన్ డాలర్లకు చేరుకుందని సెంట్రల్ బ్యాంక్ తెలిపింది. దీనితో పాటు, ఐఎంఎఫ్ వద్ద భారతదేశ నిల్వలు కూడా 176 మిలియన్ డాలర్లు పెరిగి 4.62 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

# భారత మార్కెట్లకు అమెరికా సంస్థ టోకరా

భారత స్టాక్ మార్కెట్లలోని లొసుగులను ఆధారంగా చేసుకొని అమెరికా ట్రేడింగ్ సంస్థ జెన్ స్ట్రీట్ భారత మార్కెట్లో భారీ మొత్తాన్ని టెక్నికల్‌గా కొల్లగొట్టింది. ఎట్టకేలకు ఇది బయట పడటంతో ఆ సంస్థ భారత మార్కెట్లలో పాల్గొనకుండా సెబీ నిషేధం విధించింది. అదే విధంగా జెన్‌స్ట్రీట్ సంపాదించిన లాభం మొత్తాన్ని ఎస్క్రో అకౌంట్స్‌లో జమ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా క్యాష్ మార్కెట్లలో షేర్ల ధర స్వల్ప పెరుగుదల కూడా షేరు ఆప్షన్స్‌పై ఎక్కువ ప్రభావం చూపుతుంది. అదే విధంగా మార్కెట్ సూచీల్లో భాగమైన షేర్ల ధరలు క్యాష్, ఫ్యూచర్స్‌లో పెరిగినా లేదా తగ్గినా సదరు ఇండెక్స్ ఆప్షన్స్ విలువలో ఎక్కువ మార్పులు చోటు చేసుకొంటాయి. ఈ విషయాన్ని గ్రహించిన జెన్ స్ట్రీట్ పలు వ్యూహాలతో భారత మార్కెట్లో ట్రేడింగ్ చేసింది.




మోసపూరిత ఈ ట్రేడింగ్‌ల కోసం భారత్‌లో జెన్ స్ట్రీట్ ఆసియా ట్రేడింగ్ లిమిటెడ్, జెన్ స్ట్రీట్ ఇండియా ట్రేడింగ్ ప్రయివేటు లిమిటెడ్, జెన్ స్ట్రీట్ ఆసియా ఎల్‌ఎల్‌సీ అనే సంస్థలను రిజిస్టర్ చేసింది. ఒక కంపెనీ షేర్లను పెంచడం, తగ్గించడం చేసి దాని ఆధారంగా ఆప్షన్స్ సూచీల్లో ట్రేడింగ్ చేసి భారీగా కొల్లగొట్టింది. ఈ విధంగా 2023 జనవరి నుంచి 2025 మార్చి 31 వరకు రూ.43,289 కోట్ల లాభాలను సంపాదించింది. కేవలం 21 రోజుల్లో రూ.4,843 కోట్ల ఆదాయాలను సంపాదించిందని సెబీ ప్రాథమికం గా గుర్తించింది. 2024 జనవరి 17వ తేదీ సహా మరో 14 బ్యాంక్ నిఫ్టీ ఎక్స్‌పైరీ డేట్లలో జేన్ స్ట్రీట్ అనుసరించిన విధానాలను సెబీ విశ్లేషించి.. ఈ మోసాన్ని గుర్తించింది. ఒక సంస్థ క్యాష్, ఫ్యూచర్ మార్కెట్లలో ఆర్డర్లు పెట్టడం, లావాదేవీలు చేయడం చేస్తుంటే.. అదే సమయంలో మరో సంస్థ ఆప్షన్స్ మా ర్కెట్లో దానికి అనుగుణంగా కార్యకలాపాలు నిర్వహించేదని సెబీ విశ్లేషించింది.

## స్పోర్ట్స్

# రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ.. రెండో భారతీయుడిగా గిల్ రికార్డు

టెస్టు సారథిగా తొలి సిరీస్‌లోనే చెరిగిపోని ముద్ర వేస్తున్నాడు శుభ్‌మన్ గిల్ క్రీడా దిగ్గజాలను ఆశ్చర్యపరుస్తూ.. అభిమానులను ఆనందంలో ముంచెత్తుతూ టీమిండియా కెప్టెన్‌గా కొత్త శిఖరాలను అధిరోహిస్తున్నాడీ యువకెరటం. లీడ్స్‌లో శతకంతో సారథిగా తాను నూరుపాళ్లు న్యాయం చేస్తానని చాటిన అతడు.. ఎడ్జ్‌బాస్టన్ టెస్టులోనూ విధ్వంస రచన కొనసాగిస్తున్నాడు. ఇంగ్లండ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ తొలి ఇన్నింగ్స్‌లో ద్విశతకంతో చెలరేగిన గిల్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీతో కదం తొక్కాడు. లంచ్‌కు ముందు క్రీజులోకి వచ్చిన గిల్.. క్లాస్ బ్యాటింగ్‌తో జట్టు ఆధిక్యాన్ని పెంచుతూనే వ్యక్తిగత మైలురాయికి చేరువయ్యాడు. బషీర్ ఓవర్లో సింగిల్ తీసి మూడంకెల స్కోర్‌కు చేరువయ్యాడు. దాంతో, ఒకే టెస్టులో డబుల్ సెంచరీ, సెంచరీ బాదిన రెండో భారత క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు. సునీల్ గవాస్కర్ 1971లో మొదట ఈ ఫీట్ సాధించాడు. మొత్తంగా ఆటగాడిగా ఈ ఘనత సొంతం చేసుకున్న తొమ్మిదో ఆటగాడిగా ప్రిన్స్ నయా చరిత్ర లిఖించాడు. రెండో ఇన్నింగ్స్‌లో శుభ్‌మన్ గిల్ సెంచరీతో విరుచుకుపడగా భారత జట్టు మ్యాచ్‌పై పట్టుబిగించింది. లంచ్ తర్వాత రిషభ్ పంత్(61)తో సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిన గిల్.. అనంతరం రవీంద్ర జడేజా(25)తో 68 రన్స్ జోడించాడు.




దాంతో, టీ సెషన్‌కు భారత్ నాలుగు వికెట్ల నష్టానికి 304 రన్స్ చేసింది. 484 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. దాంతో,




టీ సెషన్‌కు భారత్ నాలుగు వికెట్ల నష్టానికి 304 రన్స్ చేసింది. 484 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

### ఇంగ్లండ్‌పై 52 బంతుల్లోనే సెంచరీ.. చరిత్ర సృష్టించిన వైభవ్..!




భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మరోసారి చరిత్ర లిఖించాడు. పద్నాలుగేళ్లకే ఐపీఎల్‌లో 35 బంతుల్లోనే శతకంతో రికార్డులు నెలకొల్పిన ఈ చిచ్చరపిడుగు.. ఈసారి ఇంగ్లండ్‌పై తన ప్రతాపం చూపించాడు. అండర్ -19 జట్టు తరఫున ఆడుతున్న ఈ కుర్రాడు శుక్రవారం 52 బంతుల్లోనే సెంచరీతో చెలరేగాడు. నాలుగో వన్డే మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు బౌలర్లపై ఎడాపెడా బౌండరీలతో విరుచుకుపడిన వైభవ్ మూడంకెల స్కోర్‌తో గర్జించాడు. ఐపీఎల్ 18వ సీజన్‌లో వేగవంతమైన సెంచరీతో వార్తల్లో నిలిచిన వైభవ్.. విదేశీ గడ్డపై కూడా పరుగుల వరద పారిస్తున్నాడు. ఇంగ్లండ్ అండర్ -19 జట్టుతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగుతున్న ఈ హిట్టర్ శుక్రవారం తన విధ్వంసాన్ని తారాస్థాయికి తీసుకెళ్లాడు. ఇంగ్లండ్ బౌలర్లను ఊచకోత కోస్తూ 52 బంతుల్లోనే శతకంతో తన సత్తా ఏంటో మరోసారి ప్రపంచానికి చాటాడు. కేవలం 78 బంతుల్లోనే 143 రన్స్‌తో భారత్‌కు భారీ స్కోర్ అందించాడీ యువకెరటం. అతడి విధ్వంసానికి పాకిస్థాన్ బ్యాటర్ కమ్రాన్ గులామ్ పేరిట ఉన్న రికార్డు తుడిచిపెట్టుకుపోయింది.

**రెండో వేగవంతమైన శతకం**

పన్నెండు ఏళ్లకే రంజీల్లో అరంగేట్రం చేసిన వైభవ్‌ను మెగా వేలలో రాజస్థాన్ రాయల్స్ సొంతం చేసుకుంది. రూ.1.5 కోట్లకు రాజస్థాన్ శిబిరంలో చేరిన ఈ కుర్రాడు తన బ్యాటింగ్‌ను సానబెట్టుకున్నాడు. కెప్టెన్ సంజూ శాంసన్ గాయపడడంతో లక్నోతో మ్యాచ్‌లో వైభవ్‌కు ఓపెనర్‌గా అవకాశం వచ్చింది. తొలి పోరులోనే 35 పరుగులతో ఆకట్టుకున్న ఈ చిచ్చరపిడుగు.. ఆ తర్వాత గుజరాత్ టైటాన్స్‌పై సెంచరీతో గర్జించాడు. ఐపీఎల్ హిస్టరీలోనే రెండో వేగవంతమైన శతకం నమోదు చేశాడు. బౌలర్ మారినా బంతి గమ్యం స్టాండ్స్‌లోకే అన్నట్టు చెలరేగిన వైభవ్.. 35 బంతుల్లోనే వందతో జైపూర్ ప్రేక్షకులకు సెల్యూట్ చేశాడు. అతడి విధ్వంసక ఇన్నింగ్స్‌లో 7 ఫోర్లు, 11 సిక్సర్లు ఉండడం విశేషం. ఐపీఎల్‌లో వేగవంతమైన సెంచరీ బాదిన వాళ్లలో క్రిస్ గేల్ అగ్రస్థానంలో ఉన్నాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఆడుతున్న రోజుల్లో గేల్ 30 బంతుల్లోనే శతకగర్జన చేశాడు. 35 బంతుల్లోనే వంద కొట్టేసిన వైభవ్ రెండో స్థానం సొంతం చేసుకున్నాడు. యూసుఫ్ పఠాన్, డేవిడ్ మిల్లర్‌లు కూడా ఫాస్టెస్ట్ సెంచరీ వీరుల జాబితాలో ఉన్నారు.

### 'మేం టికెట్ కొనిస్తాం.. భారత్‌కు పంపించేయండి': ప్రసిద్ధ్‌పై నెట్టింట విమర్శలు

ఇంటర్నెట్ డెస్క్: ఇంగ్లాండ్‌తో రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ ఒక్క వికెట్ తీయలేకపోయాడు. 13 ఓవర్లు వేసిన ప్రసిద్ధ్ 72 పరుగులు ఇచ్చాడు. షార్ట్ పిచ్ బంతులతో ప్రత్యర్థి బ్యాటర్లకు పరీక్ష పెడదామని భావించిన టీమ్ఇండియా వ్యూహం ఫలించలేదు. ఇంగ్లాండ్ బ్యాటర్ జేమీ స్మిత్ ఎదురు దాడికి దిగాడు. అతడు భారీ శతకం చేయడానికి ఓ రకంగా ప్రసిద్ధ్ బౌలింగ్ కారణమని సోషల్ మీడియా వేదికగా కామెంట్లు వస్తున్నాయి. తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ప్రసిద్ధ్ ఐదు వికెట్లు తీసినా ఆరు రన్‌రేట్‌తో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 220 పరుగులు సమర్పించాడు. దీంతో లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం ఇవ్వకుండా ప్రసిద్ధ్‌ను ఆడించడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. అందులో కొన్ని కామెంట్లు ఇవీ.. "ఇలా అంటున్నందుకు క్షమించాలి.. 35 ఏళ్ల భువనేశ్వర్ కుమార్ కూడా చాలా అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. ప్రసిద్ధ్ కంటే ఇంగ్లిష్ పిచ్‌లపై భువీ ఇంకా బాగా వేయగలడేమో" "అర్ష్‌దీప్ సింగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో కూర్చొని ఉన్నాడు. ప్రసిద్ధ్ కృష్ణ మాత్రం వరుసగా టెస్టులు ఆడేస్తున్నాడు. ఓవర్‌లో ఆరు బంతులు బౌండరీలు పోతున్నాయి. ఇలాంటి సెలక్షన్ చూస్తుంటే వింతగా అనిపిస్తోంది" "సాధారణంగా విరాట్ కోహ్లీని రన్ మెషీన్ అంటారు. ఇక్కడ ఇంగ్లాండ్‌కు ప్రసిద్ధ్ రన్ మెషీన్‌లా మారినట్లుంది. ప్రసిద్ధ్ భారత వెర్షన్ హారిస్ రవూఫ్" "ప్రసిద్ధ్ కృష్ణను వెంటనే భారత్‌కు పంపించండి. కావాలంటే నేను బిజినెస్ క్లాస్ టికెట్‌ను స్పాన్సర్ చేస్తా. దయచేసి టెస్టుల్లో మళ్లీ నువ్వు ఆడొద్దు"




Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143